సూర్యోదయ వార్త

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 43 | ఆదివారం 08.11. 2026 | పేజీలు :4 | వెల: 2

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు



- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు 2



ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులూ అప్రమత్తం!

వరి సాగుకు దూరంగా ఉండండి.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వండి

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రాష్ట్రంలో కూడా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని కోరారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరుసగా పర్యటిస్తానని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

హైదరాబాద్ సూర్యోదయ వార్త

తెలంగాణలో రాబోయే రోజుల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశముందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరూ సమష్టిగా పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సీఎం



- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కాళేశ్వరం విధ్వంసానికి బీఆర్ఎస్ అవినీతే కారణం
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన కేటీఆర్ తనలా మారలేడు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

కరువుపై కాకుండా గ్లోబల్ సమ్మిట్‌పై చర్చా?!

- రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు నిధుల్లేవంటున్నారు..
- గ్లోబల్ సమ్మిట్‌కు, ఫ్యూచర్ సిటీకి నిధులు ఎలా వస్తున్నాయి?
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఫైర్
- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎండి పోయిన పంటల పరిశీలన

: రాష్ట్రంలో 25 లక్షల ఎకరాలు ఎండి పోయి రైతులు కరువుతో కొట్టుమిట్టాడుతుంటే గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో రైతులను ఆదుకునే ఒక్క అంశాన్ని కూడా చర్చించకుండా గ్లోబల్ సమ్మిట్‌పై చర్చించడం ఏంటని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల్లో తక్షణ కరువ సహాయంగా ఒక్కో రైతుకు ఆయా ప్రభుత్వాలు రూ.5 వేలు చొప్పున చెల్లించాయని చెప్పారు. కానీ రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు నిధులు లేవంటోందని ధ్వజమెత్తారు. అలాంటప్పుడు గ్లోబల్ సమ్మిట్‌కు, ఫ్యూచర్ సిటీకి, మూసీ సుందరీకరణకు నిధులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఎండి పోయిన పంటలను హరీశ్‌రావు పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కరువు బారిన పడిన రైతులకు తక్షణం ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల బీమా కోసం బడ్జెట్‌లో రూ.1,600 కోట్లు ప్రకటించి బల్లలు చరిచారని, మూడేళ్లయ్యిందని.. పంటల బీమా ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. పంటల బీమా అమలు చేసి ఉంటే ఇప్పుడు కరువుతో పంట నష్టపోయిన బాధిత రైతులకు పరిహారం అందేదని అన్నారు. అతివృష్టి.. అనావృష్టి.. ఉంటాయి.. కానీ రాష్ట్రంలో వచ్చింది ముమ్మాటికీ రేవంత్ వృష్ట?టనని హరీశ్‌రావు అన్నారు. దేవాదులలో 60 టీఎంసీలు



ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నప్పటికీ కేవలం 18 టీఎంసీలకే పరిమితం చేసి చంద్రబాబుకు వదిలేయడమే ఇందుకు ఉదాహరణ అని వివరించారు. మహబూబ్‌నగర్‌లో కృష్ణా నీటిని కూడా అలాగే దిగువకు వదిలేశారని విమర్శించారు. నదుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నా మోటార్లు ఆన్ చేయకుండా పంటలు ఎండబెట్టిన అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ అని విమర్శించారు. మరమ్మతుల పేరుతో 20 టీఎంసీల సింగూరు నీటిని నదిలోకి వదిలేసి సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల వాసులకు తాగునీరు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మరమ్మతు పనులను కనీసం పది శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రజల తాగునీటి అవసరాలకు నీళ్లు ఇవ్వని ప్రభుత్వం, బీరు కంపెనీలకు మాత్రం పుష్కలంగా నీటిని సరఫరా చేస్తోందని విమర్శించారు.

డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

- ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం
- బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

- కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రమే
- 1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్క నీరు అందకముందే ఐదు రెట్లకు చేరిన అంచనా వ్యయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం
- నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క 2

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి ఆపన్నహస్తం




బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్





ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత

వచ్చే నెల 9న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరించిన తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు



దుమ్ముగూడెం, నవంబర్ 7(సూర్యోదయ వార్త) :

డిసెంబర్ 9న హైదరాబాద్లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం దుమ్ముగూడెం మండల తుడుందెబ్బ కమిటీ ఆధ్వర్యంలో కోమరం భీమ్ విగ్రహం వద్ద తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలు, ఆదివాసీ హక్కులు, చట్టాల ఉల్లంఘనలపై ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ లంబాడా సమస్యపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించేందుకు ఆదివాసీ యువతీ యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యం.. జాతి అస్తిత్వమే మన పోరాటం"లిలి అనే నినాదంతో డిసెంబర్ 9న హైదరాబాద్లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, కణితి బాలు, జగదీష్, రమేష్, శంకర్, నర్సింహారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం, నవంబర్ 7. (సూర్యోదయ వార్త ప్రతినిధి).

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం భద్రాచలం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులు, అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, వార్డు సభ్యులు, తహసీల్దార్ రవికుమార్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

-బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి..

వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్..

వాజేడు. ములుగు జిల్లా. నవంబర్ 07 (సూర్యోదయ వార్త)



బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలకు. 88. 50 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలియజేసిన వాడ బలిజ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి – బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆత్మగౌరవ భవనాలతో పాటు బీసీలకు విద్య ఉద్యోగ అవకాశాలు రాజకీయ రంగంలో బీసీలకు అవకాశాలు కల్పిస్తూ బీసీలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు .బీసీ కార్పొరేషన్ ద్వారా 90% సబ్సిడీ రుణాలు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్రంలో వెనకబడి ఉన్నటువంటి బీసీ కులాలను అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నందున బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు ..

హరీష్ రావు కాదు.. అబద్ధాల రావు: ఆది శ్రీనివాస్

హరీష్ రావు కాదు.. అబద్ధాల రావు.. రైతులను మోసం చేయాలని చూస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, వారి కష్టాలపై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. శనివారం సీఎల్పీ మీడియా సెంటర్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ కోతల వల్ల ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోలేదని, బోర్లలో నీళ్లు లేకపోవడం వల్లే పంటలు ఎండిపోయాయని రైతులే చెబుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించామని తెలిపారు. ఏప్రిల్ నుంచే ఎల్నినో ప్రభావంపై రైతులను అప్రమత్తం చేస్తూ వ్యవసాయ అధికారులతో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తకుండా ఆంధ్రప్రదేశ్కు వదిలేస్తున్నారంటూ హరీష్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు.

పిల్లలు డ్రగ్స్, గంజాయి.మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- పేరూరు ఎస్సై. అశోక్..

వాజేడు. ములుగు జిల్లా. నవంబర్ 07(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు అయ్యవారిపేట లో కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు. నిర్వహించారు.డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు అలవాటుపడి మీ పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని మీ పిల్లల చదువుపై దృష్టి సారించాలి, పేరూరు ఎస్సై అశోక్ పేర్కొన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ –విద్యా ర్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించాలని, మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులకు కొన్ని సూచనలు చేశారు.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను



తెలుసుకొని వాటికి ఆకర్షితులు కావద్దని సూచించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల బారినపడి పెడదారి పట్టకుండా విద్యార్థి దశ నుండే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు ... విద్యార్థులు, యువతలో విస్తృత అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి లేస్తుందని తెలిపారు.



విద్యార్థుల భవిష్యత్తును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్వరరావు, స్వరూప, రమాదేవి, దీప, భాస్కర్, ప్రసాదు, 70 మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చీకటిపై వెలుగు.. చెడుపై మంచి - విద్యార్థులకు దీపావళి సందేశం

సరస్వతి విద్యానికేతన్లో దీపావళి ప్రత్యేక అవగాహన కార్యక్రమం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల రూరల్, తేగడ, నవంబర్ 7. (సూర్యోదయ వార్త ప్రతినిధి).

తేగడలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్లో దీపావళి పండుగ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ ప్రాముఖ్యత, పౌరాణిక విశిష్టత, వ్యక్తిగత భద్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ దీపావళి చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. కోపం, అసూయ, ద్వేషం వంటి చెడు భావాలను విడిచిపెట్టి ప్రేమ, దయ, నిజాయితీ, మంచితనాన్ని



అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో దీపాలు వెలిగిస్తూ మంచి గుణాలను అలవర్చుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి పౌరాణిక గాథలను వివరిస్తూ ధర్మం, సత్యం, మంచితనం యొక్క ప్రాముఖ్యతను రాజేశ్వరి, శ్రీదేవి, పూజ వివరించారు. ఉపాధ్యాయుడు రమేష్ బాణసంచా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ,



పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని, పర్యావరణానికి హాని కలిగించే అధిక శబ్దం, పొగకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో జ్ఞానం, ప్రేమతో మానవత్వం, క్రమశిక్షణతో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, రాజేశ్వరి, పూజ, ప్రమీల, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టుకున్న భార్యనే కడతేర్చిన కసాయి భర్త.. మానవత్వానికే మచ్చ!

- **భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన భర్త..**
- **పోలీసుల గాలింపులో మృతదేహం గుర్తింపు**

కొత్తగూడెం, నవంబర్ 7. (సూర్యోదయ వార్త ప్రతినిధి).

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తన భార్యను హత్య చేసి, మృతదేహాన్ని గోదావరి నదిలో పడేసినట్లు ఆర్మ్ రిజర్వ్ కానిస్టేబుల్ అరెస్టయ్యాడు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించగా, అతని సమాచారం మేరకు గోదావరిలో చేపట్టిన గాలింపు చర్యల్లో భార్య మృతదేహాన్ని గుర్తించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుండారపు స్వరూప తన సోదరి భవాని కనిపించడం లేదంటూ నవంబర్ 6న ఫిర్యాదు చేశారు. దీనిపై క్రైమ్ నంబర్ 205/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో బయటపడిన నేరం దర్యాప్తులో భవాని భర్త, ఏఆర్పీసీ-623కి చెందిన బోడా నరేందర్ (30), టేకులపల్లి మండలం గోలియాతండాకు చెందినవాడు, తన భార్యను హత్య చేసినట్లు వెల్లడించాడు. నవంబర్ 3 రాత్రి సుమారు 8 గంటలకు తన అద్దె ఇంట్లో భవానిని చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి హత్య



చేసినట్లు అతను పోలీసులకు తెలిపాడు. అనంతరం మృతదేహాన్ని తెల్లని సంచిలో ఉంచి తన స్వగ్రామమైన గోలియాతండాకు తీసుకెళ్లి, తండ్రి హరిలాల్ సహాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టినట్లు నిందితుడు చెప్పాడు. తర్వాత నవంబర్ 4 రాత్రి సుమారు 11 గంటలకు మృతదేహాన్ని మోటార్ సైకిల్పై భద్రాచలం గోదావరి వంతెన వద్దకు తీసుకెళ్లి నదిలో పడేసినట్లు వెల్లడించాడు. నేరానికి సంబంధించిన ఆధారాలను మాయం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గాలింపులో

మృతదేహం గుర్తింపు నిందితుడు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు పంచుల సమక్షంలో గోదావరి నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు నిర్వహించారు. ఈ చర్యల్లో భవాని మృతదేహాన్ని గుర్తించారు. బర్గంపాడ్ మండలం వేలేరు పరిసరాల్లో మృతదేహం లభించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కేసులో నిందితుడు బోడా నరేందర్ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

ఎస్పీ ప్రకటన. నేరంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, వన్ టౌన్ సీఐ జితేందర్, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయ్ సింహారెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ రమేష్తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

భద్రాచలంలో 7-ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

క్రీడలతో యువతలో క్రమ-శిక్షణ, ఆత్మవిశ్వాసం - ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.

భద్రాచలం, నవంబర్ 7. (సూర్యోదయ వార్త ప్రతినిధి).

భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7-ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకుని, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు శు భాకాంక్షలు తెలిపారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వాన్ని కలిగించడమే కాకుండా క్రమశిక్షణ, జట్టుకృషి, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని ఆయన అన్నారు.





యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తిని పెంచుకోవాలని, వివిధ స్థాయిల్లో రాణించడానికి శ్రమించాలని ఎమ్మెల్యే కోరారు. క్రీడల ద్వారా యువతకు ఆరోగ్యం, ధైర్యం, ఓటమిని సహించే శక్తి, విజయంపై ఆత్మవిశ్వాసం అలవరుస్తాయని తెలిపారు.ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడి, మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆశించారు. భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతిభ చూపుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపట్నంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

పినపాక, నవంబర్ 7 (సూర్యోదయం వార్త)

మండలంలోని భూపాలపట్నం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణశ్రీ పాల్గొన్నారు.



భద్రాచలం ఎమ్మెల్యే. తెల్లం వెంకట్రావుకు వినతి పత్రం అందజేసిన ఏకన్నగూడెం గ్రామస్తులు





వెంకటాపురం. నూగూరు. ములుగు జిల్లా. నవంబర్ 07- (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఏదిర గ్రామపంచాయతీ పరిధిలో గల ఏకన్న గూడెం గ్రామంలో ఉన్న ప్రైమరీ స్కూలుకు బిల్డింగు లేక గ్రామస్తులందరూ కలిసి చందాలు వేసుకొని రేకుల షెడ్డు తో పాఠశాలను నిర్మించుకున్నారు. స్కూల్ భవనం లేక పిల్లలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల దగ్గర పిల్లలకు అవసరమైన మరుగుదొడ్లు(టాయిలెట్స్) లేక ఆడపిల్లలు అవస్థలు పడుతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు ఈ సమస్య పరిష్కరించాలని దరఖాస్తులు ఇచ్చామని కానీ ఇప్పటివరకు ఏ అధికారి స్పందించలేదన్నారు. ఇప్పటికైనా మా ఏకన్నగూడెం గ్రామంలో మంచి చదువుల కోసం మా పిల్లలకు సౌకర్యాల కోసం నూతన బిల్డింగ్ మంజూరు చేయాలని శనివారం భద్రాచలం ఎమ్మెల్యే. తెల్లం వెంకట్రావు కు యాకన్న గూడెం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే నూతన భవనం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదిర గ్రామపంచాయతీ ఉపసర్పంచ్. యాక నరసింహారావు యాక శ్రీను. యాక సావిత్రి. యాక బాలకృష్ణ. ఇరుప బాలరాజు. యాక శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

పెండ్లి వాగు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు భూములకు నీరు అందించాలి..

మంత్రి. సీతక్కకు వినతి పత్రం అందజేసిన లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్. మొగిలిపల్లి రవీందర్.



తాడ్వాయి ములుగు జిల్లా. నవంబర్ 07 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లింగాల గ్రామంలోనే పెండ్లి వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించుటకు ఫ్రెండ్లీ వాగుపై 2023 సంవత్సరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కాంతిలాల్ దండే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువుల నింపి. చెరువుల నుండి వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని లక్ష్యంతో పనులను ప్రారంభించారు. కానీ కరెంట్ లైన్. ట్రాన్స్ఫార్మర్. మోటర్లు కొంత మేరకు పైప్ లైన్ వేసి పనులు ఆపేశారు ఇప్పటికీ పనులు పూర్తికాక 23 సంవత్సరాలు అవుతుంది. అప్పటినుండి పను లు నిలిచిపోయాయి. లింగాల బోటిలింగాల. మిర్యాల పేట. మామిడి గూడెం. దుబ్బగూడం.లో చెరువును నింపడం ద్వారా బీడు భూములు. ఆకాశ సాయి భూములు. వర్షం ఆధార భూములు. సాగులోకి వస్తాయని ప్రజలు మళ్ళీ పనులు ప్రారంభించాలని పెండ్లి వాగు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని పంచాయతీరాజ్. శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి. ధనసరి అనసూయ సీతక్కకు శనివారం లింగాల గ్రామస్తులు. సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఊకె పోతరాజు ఊ కే కృష్ణ చాపల జగ్గారావు చెన్నూరి సతీష్ చెన్నూరు రవి చెన్నూరి అనిల్ దుబ్బగూడం గ్రామపంచాయతీ నుండి కల్తీ శేఖర్ సురభాగ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు..

ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి...

మండల విద్యాశాఖ అధికారి - గడ్డి శ్రీనివాస్



తాడ్వాయి. ములుగు జిల్లా. నవంబర్ 07 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా తాడ్వాయి ఏహెచ్ఎస్ బాలికల పాఠశాల లొ హెచ్ఎం రేవతి ఆధ్వర్యంలో పదవ తరగతి ఫలితాలు 100% సాధించడానికి ఉపాధ్యాయుల శనివారం సమావేశం ఏర్పాటు చేశారు... ఈ సమావేశం కు ముఖ్య అతిథిగా హాజరైనా మండల విద్యాశాఖ అధికారి. గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరము 10వ తరగతి ఫలితాలు 100% సాధించడానికి అందరూ కృషి చేయాలని కోరారు అలాగే విద్యార్థులంతా ఎక్కువ సమయము పాఠశాలల్లోనే ఉంటారు కనుక వారికి వివిధ అంశాలలో ఉన్న సందేహాలను నివృత్తి చేసి విషయం పట్ల పరిజ్ఞానాన్ని పెంచి 100% ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేణుక ఉపాధ్యాయులు సుహాసిని సరోజినీ లక్ష్మి ఉషారాణి వినోద నారాయణ వెంకన్న మమత కళ్యాణ్ పాల్గొన్నారు..

ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం..

- **ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఆదివాసులకే కేటాయించాలి..**
- **ఆదివాసీ నవనిర్మాణ సేన మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్..**

వాజేడు. ములుగు జిల్లా నవంబర్ 07 (సూర్యోదయ వార్త)

– తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం హర్షణీయమని, తెలంగాణలోని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు ఒక కీలక ముందడుగు కావాలని ఆదివాసీ నవనిర్మాణ సేన మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్ పేర్కొన్నారు.భారత రాజ్యాంగం ఆదివాసీ గిరిజన సమాజానికి కల్పించిన హక్కులు, రక్షణలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా ఎస్టీ కమిషన్ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న భూమి సమస్యలు, విద్యా, ఉద్యోగ, వైద్య రంగాల్లో వెనుకబాటుతనం, అటవీ హక్కులు, పోడు భూముల సమస్యలు, రాజ్యాంగబద్ధమైన హక్కుల ఉల్లంఘన వంటి అంశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఆదివాసీ తెగకు చెందిన వారికి అవకాశం కల్పించినట్లయితే ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక పరిస్థితులు, రాజ్యాంగపరమైన హక్కులపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి మాత్రమే ఆ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరని అభిప్రాయపడ్డారు. కాబట్టి ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని ఆదివాసీ తెగలకు చెందిన అర్హత, సామర్థ్యం, సామాజిక నిబద్ధత కలిగిన వ్యక్తికే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసే కమిషన్‌లో ఆదివాసీలకే ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశం కల్పించడం ద్వారా మాత్రమే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కమిషన్‌కు ఉండాల్సిన ప్రధాన బాధ్యతలుఆదివాసీల రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగ నిబంధనలు, చట్టాల అమలును పర్యవేక్షించాలన్నారు.పెసా చట్టం , 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం అమలుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు.ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలనీ పేర్కొన్నారు.ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వానికి సూచనలు చేయాలనీ కోరారు.ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, దోపిడీ, అన్యాయాలపై



విచారణ జరిపించాలనీ తెలిపారు. అటవీ హక్కుల చట్టం అమలు, ఆదివాసీ సంస్కృతి, భాష, సంప్రదాయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ శాఖల్లో ఆదివాసీలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా పర్యవేక్షించాలనీ .ఆదివాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కమిషన్ పనిచేయాలి ఎస్టీ కమిషన్ కేవలం ఒక పరిపాలనా వ్యవస్థగా కాకుండా ఆదివాసీ ప్రజల గొంతుకగా, వారి హక్కులకు రక్షణ కవచంగా నిలవాలని డాక్టర్ పాపారావు ఆకాంక్షించారు. కమిషన్‌లో ఆదివాసీ మేధావులు, విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సామాజిక ఉద్యమకారులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ఆదివాసుల కోసం ఏర్పడే కమిషన్‌కు ఆదివాసీలే నాయకత్వం వహించాలి. ఆదివాసుల సమస్యలను అర్థం చేసుకునే వారికే బాధ్యతలు అప్పగించాలి. అప్పుడే ఎస్టీ కమిషన్ ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుంది.ఎస్టీ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అదే సమయంలో చైర్మన్ పదవిని ఆదివాసీ వ్యక్తికే కేటాయించి ఆదివాసీ సమాజానికి తగిన గౌరవం, ప్రాతినిధ్యం కల్పించాలని కమిషన్ ను కోరారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన దీపావళి

- **ఒక చిన్నారి చిరునవ్వు ఓ వెలుగు..**
- **మంగపేట ఎస్సై మధుకర్..**
- **చిన్నారుల కళ్ళల్లో ఆనందం చూడడమే జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యం..**
- **జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 మంది నిరుపేద చిన్నారులకు దీపావళి కిట్ల పంపిణీ.**

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 07 (సూర్యోదయ వార్త)

దీపావళి పండుగ అంటే కేవలం మన ఇళ్లకే పరిమితం కాకుండా, సమాజంలోని నిరుపేదల జీవితాల్లో కూడా వెలుగులు నింపినప్పుడే దానికి నిజమైన సార్థకత చేకూరుతుందని మంగపేట సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) మధుకర్ పేర్కొన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో శనివారం జ్వాలా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో "ఒక చిన్నారి -- ఒక చిరునవ్వు -- ఒక వెలుగు" అనే నినాదంతో నిర్వహించిన సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పండుగను జరుపుకునే ఆర్థిక స్థోమత లేని 30 మంది నిరుపేద చిన్నారులను





గుర్తించి, వారికి ప్రత్యేక దీపావళి కిట్లను (మిఠాయిలు, పండ్లు, కాకరపువ్వొత్తులు) అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ... పేద చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించేందుకు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చేసిన ఈ ప్రయత్నం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.అనంతరం ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ... ప్రతి చిన్నారి సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కుటుంబ సమేతంగా వేడుకలు జరుపుకుంటూనే, బాణాసంచా కాల్చే సమయంలో చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు గంగుల చంటి, వీరన్, కార్యదర్శి భాస్కర్, ప్రచార కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ శ్రావణ్, ప్రతినిధులు ఎడ్లపల్లి సాయి, నిమ్మల నరేష్, మావిళ్ల నాగరాజు, భూక్యా రవి, గోలి విద్యాసాగర్, సాధనపల్లి సాంబశివరావు, కర్రె లక్ష్మణ్, తోగరు సురేష్, బూర సాయి, బూర గణేష్, ఉడుగుల మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **మంగపేట మండల కాంగ్రెస్సి పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు**
- **బుచ్చంపేట గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..**

మంగపేట, ములుగు జిల్లా. నవంబర్ 07(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ,ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు



అందించేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై పనిచేస్తోందని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి,అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్,నాయకులు గడ్డం శ్రీహరి,పల్లె శోభన్,పన్నాల కొండల్ రెడ్డి,గడ్డం పరమేశ్,రాచకొండ సోమయ్య,లబ్ధిదారులు,డీలర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు..

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్. సిహెచ్ వెంకటయ్య.**

ఏ టూరు నాగారం. ములుగు జిల్లా. నవంబర్ 07- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా ఏటూరు నాగారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత ఎన్నికల సంఘం సూచనల తో స్వీప్ ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ (ఎలక్షన్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన – క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా





ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ పోటీల నిర్వహణకు స్వీప్ కో-ఆర్డినేటర్ కె. రమేష్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అనంతరం రమేష్. మాట్లాడుతూ విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు మరియు ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకే ఈ వ్యాసరచన. క్విజ్ పోటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ (ఐ ఓ ఏసీ) కో-ఆర్డినేటర్ డా. పి. జ్యోతి ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్(డబ్ల్యూ ఈ సి) కనీస్ ఫాతిమా అధ్యాపకులు, స్వీప్ సభ్యులు భాస్కర్, జీవవేణి, సంపత్, శ్రీధర్, శేఖర్, భావన,శ్రీకాంత్, ప్రశాంతి సుమలత,బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు త్వరలోనే బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక కాంగ్రెస్ శ్రేణులకు ఆహ్వానం..

ఏటూరునాగారం మండల కేంద్రంలో ఘనంగా జన్మదిన వేడుకలు.

ఏటూరు నాగారం. ములుగు జిల్లా నవంబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి))

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రజా నాయకులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10:00 గంటలకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు..ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ వేడుకలను నిర్వహిస్తున్నాము.కావున కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు, చైర్మన్లు, సర్పంచులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరారు. దేవులపల్లి విజయ్ కుమార్ . – కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు-ఏటూరునాగారం.



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

అసలైన భీభత్సాన్ని అనుభవించడానికి సిద్ధం అవ్వండి..

హారర్ సినిమాను ప్రకటించిన భూమి పెడ్నేకర్

బాలీవుడ్ బ్యూటీ భూమి సతీష్ పెడ్నేకర్ తొలిసారిగా ఓ భారీ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'జానీ దుష్మన్' అనే పేరుతో రాబోతున్న ఈ భారీ ఒరిజినల్ హారర్ ఫ్రాంచైజ్ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు టి-సిరీస్ ఫిల్మ్స్ అధినేత భూషణ్ కుమార్, ఆల్‌మైటీ మోషన్ పిక్చర్‌కు చెందిన ప్రభ్‌లీన్ సంధు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రకటిస్తూ.. 'భయం చాలా చూసి ఉంటారు.. కానీ ఇప్పుడు ఒళ్ళు గగుర్పొడిచే భీభత్సాన్ని అనుభవించడానికి సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్‌తో ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను రివీల్ చేసింది భూమి పెడ్నేకర్.

అలాగే ఈ చిత్రం 2027 విడుదల కాబోతున్నట్లు తెలిపింది. పూర్తిగా యునైటెడ్ కింగ్‌డమ్ నేపథ్యంలో సాగే ఈ కథ, ఒక బలమైన తల్లి-కూతుళ్ల సంబంధం, కుటుంబంలో దాగి ఉన్న రహస్యాలు, ఒక ఆత్మ భయానకమైన నీడ చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. సూపర్‌హిట్ పారానార్మల్ సిరీస్ 'భయ్ - ది గౌరవ్ తివారీ మిస్టరీ' రూపొందించిన క్రియేటివ్ టీమ్ ఈ ప్రాజెక్ట్‌తో మళ్లీ ఒకటవుతోంది. అర్షద్ సయ్యద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హారర్, యాక్షన్ ఎలిమెంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండేలా ప్రసిద్ధ బ్రిటిష్ స్టంట్ కోఆర్డినేటర్ పీటర్ పెడ్రెరో ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం విశేషం.

ఏడేళ్ల తర్వాత తమిళంలో నటిస్తున్నా..

'ఓం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మమ్ముట్టి!



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి 'ఓం' ప్రీ-రిలీజ్ వేడుకలో తనదైన శైలిలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సినిమా విశేషాలను పంచుకుంటూ సరదాగా, అదే సమయంలో ఆసక్తికరంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

'పేరన్బు' చిత్రం తర్వాత సరిగ్గా ఏడేళ్లకు తాను మళ్లీ ఒక తమిళ సినిమా చేస్తున్నానని మమ్ముట్టి తెలిపారు. ఆ సినిమా తర్వాత మరిన్ని మంచి తమిళ ప్రాజెక్ట్‌లు చేయాలని చాలా మందిని అడిగానని, కానీ ఎవరూ తనను పట్టించుకోలేదంటూ ఆయన చమత్కరించారు. అయితే, ఈ 'ఓం' సినిమా మాత్రం తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా, గుర్తుండిపోయేలా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ.. సూపర్‌స్టార్ రజనీకాంత్, ధనుష్ వంటి దిగ్గజ నటులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. "ఇప్పుడు నా పక్కనే ధనుష్ కొడుకు ఉన్నాడు, వాడు ఎప్పుడు సినిమాల్లోకి వచ్చి నటిస్తాడో నాకైతే తెలియదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి.

ఈ చిత్ర కథాంశం గురించి మాట్లాడుతూ.. ఇందులో ఎన్నో వైవిధ్యమైన భావోద్వేగాలు ఉన్నాయని తెలిపారు. సామాన్య ప్రజల జీవితాలతో ముడిపడిన కొండ ప్రాంతపు నేపథ్యం, సాయిపల్లవి పాత్ర, ధనుష్ పాత్ర.. ఇలా ఎన్నో కథలు ఈ చిత్రంలో ఉన్నాయని, అయితే సినిమా కథను మాత్రం తాను ఇప్పుడే పూర్తిగా రివీల్ చేయబోనని స్పష్టం చేశారు. షూటింగ్ అనుభవాలను వివరిస్తూ.. ఈ సినిమా షూటింగ్ కేవలం 45 రోజుల్లో పూర్తవుతుందని మొదట్లో తనకు చెప్పారని, కానీ అది కాస్తా ఆరు నెలలకు పైగా సాగిందని చెప్పారు. ఇందులో స్మగ్లర్ నేపథ్యంలో సాగే ఘట్టాలు ఉండటంతో చాలా వరకు రాత్రిపూటే షూటింగ్ చేయాల్సి వచ్చిందని సరదాగా గుర్తుచేసుకున్నారు.

'తొలి ప్రేమ కథ' టీజర్ అదుర్స్

డైరెక్టర్ శైలేష్ కొలను!



సాత్విక్ వర్మ, అనీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న పీఈఆర్ఎఫ్ లవ్‌స్టోరీ చిత్రం 'తొలి ప్రేమ కథ'. లిఖిత్, ఆదిత్య సమర్పణలో లతా కే నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి లక్ష్మణ్ అల్లు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ చాలా వైభవంగా జరిగింది. ఈ వేడుకకు యువ హీరో ఆకాష్ పూరి, ప్రముఖ దర్శకుడు శైలేష్ కొలను ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌కు సరిగ్గా సరిపోయే మూడ్‌లో 'తొలి ప్రేమ కథ' టీజర్ ఉందని, ఇలాంటి హాయిగా సాగే సహజమైన సినిమాల కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించిన సాత్విక్ ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడని, తన కష్టం టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తోందని కొనియాడారు. సినిమాటోగ్రఫీ, ధ్రువన్ అందించిన అద్భుతమైన మెలోడీ మ్యూజిక్ ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్ అవుతాయని, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూడాలని పిలుపునిచ్చారు.

యువ హీరో ఆకాష్ పూరి మాట్లాడుతూ.. చిత్రంలోని విజువల్స్ ఎంతో బ్యూటిఫుల్‌గా ఉన్నాయని ప్రశంసించారు. సాత్విక్, అనీలు చిన్నప్పటి నుంచి తనకు పరిచయమని, ఇద్దరూ అద్భుతమైన నటులని పేర్కొంటూ ఈ సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

హీరో సాత్విక్ వర్మ మాట్లాడుతూ.. తనకు ఎంతో సపోర్ట్ చేసిన డైరెక్టర్ శైలేష్ కొలనుకు, హీరో ఆకాష్ పూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదొక చక్కటి మ్యూజికల్ లవ్ స్టోరీ అని, సంగీత దర్శకుడు ధ్రువన్ అందించిన బాణీలు సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. నిర్మాత, దర్శకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలని కోరారు.

దర్శక-నిర్మాత సాయి లక్ష్మణ్ అల్లు మాట్లాడుతూ.. ఈ కథను రాసుకున్నప్పుడే సాత్విక్, అనీలను ఊహించుకున్నానని, అనుకున్నదానికంటే సినిమా అత్యంత అద్భుతంగా వచ్చిందని తెలిపారు. నేచురల్ లొకేషన్స్‌లో తెరకెక్కించిన ఈ చిత్రం అందరి మనసులను హత్తుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు.

సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ.. ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని, పోస్టర్‌పై తన పేరు వేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు అందరూ పాల్గొని సినిమా విజయం సాధించాలని కోరుకున్నారు.

ఈ చిత్రంలో సాత్విక్ వర్మ మరియు అనీ నటీనటులుగా నటించగా, లిఖిత్, ఆదిత్య సమర్పణలో లతా కె నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి లక్ష్మణ్ అల్లు దర్శకత్వం వహిస్తున్నారు మరియు తులసి కృష్ణ ఏడ్ల ఈ చిత్రాన్ని క్రియేట్ చేయగా, ఆర్.ఆర్. ధ్రువన్ సంగీతం అందిస్తున్నారు, ఇషు కథ అందించగా, రామ్ కంధ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు, ఆర్.ఆర్. ధ్రువన్ మరియు అలరాజు లిరిక్స్ అందించగా, సునీల్ పొన్నం కొరియోగ్రఫీ, నందు స్టంట్స్, హరి శంకర్ ఎడిటింగ్, వెంకట్ కలరిస్ట్ బాధ్యతలు నిర్వహించగా, మాయాబజార్ పబ్లిసిటీ డిజైన్స్ అందిస్తున్నారు మరియు తేజస్వి సజ్జా పీఆర్ఓగా వ్యవహరిస్తున్నారు.

'రామాయణ' అంటే వీఎఫ్ఎక్స్ మాత్రమే కాదు..: సల్మాన్ ఖాన్



రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'పై బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా బడ్జెట్, వీఎఫ్ఎక్స్ గురించి కాకుండా రామాయణంలోని పాత్రలు, వాటి గొప్పతనం గురించి చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందించేందుకు సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సినిమా కథ కంటే బడ్జెట్, విజువల్ ఎఫెక్ట్స్‌పైనే ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన తాజా చిత్రం 'మాతృభూమి' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్ ఖాన్.. 'రామాయణ' సినిమా గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

"రామాయణ' గురించి చర్చ జరగాలంటే అది రామాయణం కథ గురించి మాత్రమే అయి ఉండాలి. సినిమాలో ఉపయోగించిన వీఎఫ్ఎక్స్, నిర్మాణ వ్యయం గురించి కాదు..! రూ.4 వేల కోట్ల బడ్జెట్ అంటూ పదేపదే మాట్లాడటం సరైన పద్ధతి కాదని నేను భావిస్తున్నాను. సినిమా గురించి మాట్లాడేటప్పుడు రాముడు, రావణుడు, సీతాదేవి గురించి మాట్లాడాలి. మన పురాణ గ్రంథాల్లో ఉన్న విషయాలు, ఆ పాత్రల గొప్పతనం గురించి చర్చించాలి. రాముడి వ్యక్తిత్వం, ఆయనలోని సుగుణాలను ప్రజలకు తెలియజేయాలి. శ్రీరాముడు ఎంతో గొప్పవాడు. ఉత్తమ భర్త, కుమారుడు, సోదరుడు. గొప్ప యోధుడు. నేను నటించిన 'మాతృభూమి' సినిమాలోని నా పాత్రలోనూ ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి' అని సల్మాన్ ఖాన్ వివరించారు.

'అలియాస్ రుక్మిణి'లో యంగ్ లుక్‌లో నితిన్..

కృష్ణగా సరికొత్త అవతారం!



నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో తెరకెక్కుతున్న మరో ఆసక్తికరమైన చిత్రం 'అలియాస్ రుక్మిణి'. 'కోర్ట్' సినిమాతో నిర్మాణ రంగంలో మంచి విజయాన్ని అందుకున్న నాని, తన యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ రొమాంటిక్ డ్రామాను నిర్మిస్తున్నారు. 'దండోరా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నితిన్ హీరోగా నటిస్తుండగా, ఆఫియా సయ్యద్ కథానాయికగా కనిపించనున్నారు. దీప్తి గంట ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన ప్రమోషనల్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇందులో నితిన్ కృష్ణ అనే పాత్రలో సరికొత్త అవతారంలో కనిపించారు. రుక్మిణి తన జీవితంలోకి రాకముందు కృష్ణ ఎలా ఉండేవాడు? అతడి యవ్వనం, అల్లరి, అమాయకత్వం ఎలా ఉండేవి? అనే అంశాలను ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ముఖ్యంగా నితిన్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఈ ప్రమోషనల్ వీడియోలో దర్శకుడు మురళీకాంత్ దేవసోత్.. రుక్మిణి పాత్రలో నటిస్తున్న ఆఫియా సయ్యద్‌తో యువకుడైన కృష్ణ గురించి మాట్లాడతారు. ఆ తర్వాత నితిన్ ఎంట్రీ ఇస్తారు. ఈ సినిమాలో ఆయన దాదాపు పదేళ్లు చిన్నవాడిగా కనిపించేలా తన రూపాన్ని మార్చుకున్నారు. చక్కగా సెట్ చేసిన జుట్టు, పలుచటి మీసం, ఆవాలు రంగు టీషర్ట్‌తో చాలా యంగ్‌గా కనిపించారు. ఓ డెస్క్ దగ్గర పెన్ను పట్టుకుని ఆలోచనల్లో మునిగిపోయిన యువకుడిగా ఆయన కనిపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నితిన్ కొత్త లుక్ చూసి ఆఫియా సయ్యద్ సైతం ఆశ్చర్యపోయినట్లు వీడియోలో చూపించారు.

కృష్ణ పాత్రలో నితిన్ చూపించిన అమాయకత్వం, యవ్వనపు ఉత్సాహం ఈ ప్రచార వీడియోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నితిన్, ఆఫియా సయ్యద్ జోడీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. ఇప్పటికే ఈ సినిమా సంగీత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు.

హిలేరియస్ అడ్వెంచర్‌గా 'చంద్రయాన్' ట్రైలర్



రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో "చంద్రయాన్" టైటిల్‌తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇందులో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ ప్రపంచంలో కేవలం 5 దేశాలు మాత్రమే చంద్రుడి మీదకు తమ స్పేస్ క్రాఫ్ట్‌లను పంపగలిగాయి.

అలాంటి ప్రయత్నం మందమర్రి అనే చిన్న గ్రామంలో లెక్కలు, ఎక్కాలు రాని నలుగురు కుర్రాళ్లు చేస్తే ఎంత ఫన్నీగా ఉంటుందో ట్రైలర్ ద్వారా చూపించారు మేకర్స్. ఈ మేరకు ట్రైలర్ ఎలా ఉందో చూస్తే - గూగుల్ సాయంతో రాకెట్ తయారుచేసి చంద్రుడి మీదకు వెళ్లేందుకు నలుగురు కుర్రాళ్లు ప్రయత్నాలు ప్రారంభిస్తారు.